క్లుప్తంగా

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా జరిపారు. ఉభయ దాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఘనంగా పుష్పయాగం

సింహాచలం: సింహగిరిపై ప్రాచీన రామాలయంలో నిర్వహిస్తున్న సీతారామాలయ వార్షిక కల్యాణోత్సవాలు బుధవారం రాత్రితో ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారికి పుష్పయాగం విశేషంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవమూర్తులను వేదికపై అధిష్ఠంపజేసి షోడషోపచార పూజలు చేశారు. వివిధ రకాల పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. విశేషంగా హారతులు అందజేశారు.

గోతుల పూడ్చివేత



ఎన్టీపీసీ వద్ద గోతులు పూడ్చుతున్న దృశ్యం

పరవాడ: వాడచీపురుపల్లి–పరవాడ రహదారిలో ఎన్టీపీసీ నాలుగో యూనిట్ సమీపంలో అధ్వానంగా మారిన రహదారికి ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టారు. ఇక్కడ ఏర్పడిన గోతుల కారణంగా తరచూ పలు ప్రమాదాలు జరుగుతుండేవి. సమస్యను తెలుసుకున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆదేశాల మేరకు రోడ్లు భవనాల శాఖ అధికారులు స్పందించి రహదారి గోతులు పూడ్చడంతో ప్రయాణికులకు కొంత ఊరట లభించింది. ప్రమాదాల భయం తప్పిందని ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కార్మికుల శ్రేయస్సే లక్ష్యం



కార్మిక కుటుంబాలకు మంజూరు పత్రాలు అందిస్తున్న షిప్‌యార్డ్ చైర్మన్ హేమంత్‌ఖత్రి

సింధియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్ సంస్థలో పనిచేస్తున్న కార్మికుల శ్రేయస్సే లక్ష్యంగా సంస్థ పనిచేస్తుందని షిప్‌యార్డ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్‌ఖత్రి అన్నారు. షిప్‌యార్డ్‌కాలనీలో ఆధునికీకరణ చేసిన కార్మికుల నివాస గృహాలను బుధవారం ఆయన పునః ప్రారంభించారు. కార్పొరేట్ ప్లానింగ్ డైరెక్టర్ జేపీ గుప్త మాట్లాడుతూ మహిళా దినోత్సవం రోజున కార్మిక కుటుంబాలకు ఇళ్లు అప్పజెప్పడం ఆనందంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో షిప్‌యార్డ్‌కు మరిన్ని ఆర్డర్లు రాబోతున్నాయని, గుర్తింపు యూనియన్ సలహాల మేరకు కాలనీ అభివృద్ధితో పాటు కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ ఉన్నతాధికారులు, గుర్తింపు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ తల్లి పండగ



అమ్మవారి సన్నిధిలో భక్తులు

ఏయూక్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డు పెద వాల్తేరు గ్రామం మద్ది వారి పెద్దిల్లు ఆధ్వర్యంలో సెక్టార్ 5 ఎంవీపీ కాలనీలో ఎల్లమ్మ తల్లి పండగ మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి మొక్కులు చెల్లించి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మద్ది అప్పలరాజు రెడ్డి, మద్ది ప్రసాద్ రెడ్డి, మద్ది లక్ష్మణ్ రెడ్డి, మద్ది రమేష్ రెడ్డి మద్ది అప్పల రెడ్డి పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
పెందుర్తి
7997958341, 9912440606

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న వివిధ రంగాలకు చెందిన మహిళలు



జాగృతి ఎండీ సుజాతను సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

సబ్బవరం: స్థానిక జాగృతి సంస్థ కార్యాలయంలో ఎండీ కందర్ప సుజాత అధ్యక్షతన బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంస్థ సభ్యులు, మహిళా రైతులు మహిళలను చైతన్య పరిచే విధంగా నిర్వహించిన లఘునాటికలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ న్యాయవాది రజిని మాట్లాడుతూ మహిళల రక్షణకు ప్రభుత్వాలు అనేక చట్టాలు చేశాయని తెలిపారు. ఆపద వేళ దిశ యాప్‌ను విద్యార్థులు,గృహిణులు, మహిళా ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ప్రతి మహిళలో అంతర్గతంగా నాయకత్వ లక్షణాలు ఉంటాయని, అదే కుటుంబాన్ని తీర్చిదిద్దడంలో వారికి ఉపయోగపడుతుందన్నారు. సైబర్ నేరాలతో పరిస్థితులు భయానకంగా తయారయ్యాయని.. మహిళలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మాజీ ఎంపీపీ సాలాపు మీనా, ప్రొఫెసర్ సంధ్యారాణి, ఎంటర్‌ప్రెన్యూర్ టి. జయలక్ష్మి మాట్లాడుతూ జాగృతి ఎండీ కందర్ప సుజాత సేవలను అభినందించారు. ఒక మహిళ సంస్థను నడిపిస్తూ ఎంతో మంది మహిళలకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని ప్రశంసించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో నిష్ణాతులైన 10 మంది మహిళలను సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జాగృతి ఎండీ కందర్ప సుజాత, హెచ్‌వో జి. రాధిక, మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర కార్యదర్శి ఆశాజ్యోతి, నాబార్డు డీడీఎం ఎస్. శ్రీనివాసరావు, జాగృతి సంస్థ అధ్యక్షుడు కె. అమ్మతల్లినాయుడు, సీఈవో మౌక్తిక తదితరులు పాల్గొన్నారు.

సీతంరాజుకు పట్టం కట్టండి



పట్టభద్రులను కలిసి ఓటు అడుగుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



అప్పలనర్సయ్య కాలనీలో ప్రచారం చేస్తున్న యతిరాజుల నాగేశ్వరరావు

సింహాచలం: ఈనెల 13న జరిగే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. జీవీఎంసీ 96వవార్డు పరిధి ప్రశాంతినగర్, మర్రిచెట్లు కాలనీ, నల్ల క్వారీ, జేఎస్ఎన్ఆర్ఎం కాలనీలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి సీతంరాజు సుధాకర్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. బ్యాలెట్ నమూనా చూపించారు. కార్యక్రమంలో నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, పీఏసీఎస్ చైర్మన్ గొర్లె రామునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు నక్క కనకరాజు, శరగడం నరసింహమూర్తి, కిల్ల అప్పారావు, లెక్కల రమేష్ పాల్గొన్నారు.

నాటి ఉద్యమం.. నేటి తరానికి స్ఫూర్తి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్షలో పాల్గొన్న కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు

సీతమ్మధార : సీతమ్మధార: విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అనే నినాదం నేపథ్యంగా జరిగిన నాటి ఉక్కు ఉద్యమం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి కె.ఈశ్వరరావు అన్నారు. విశాఖ ఉక్కును విక్రయించరాదని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్ష బుధవారం నాటికి 704వ రోజుకు చేరింది. దీక్షలో కాంట్రాక్ట్ కార్మికులు కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ రైతులు సాగించిన పోరాట ఫలితంగా మోదీ ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుందన్నారు. ఉక్కు నిర్వాసితులు చేసిన ప్రాణత్యాగాలను బీజేపీ సర్కారు గుర్తు చేసుకోవాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే దేశంలో నంబర్ వన్ పరిశ్రమగా ఎదుగుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఐఎన్‌టీయూసీ హెచ్‌పీసీఎల్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు తాతబాబు, వై.నర్సింగరావు, టి.రామకృష్ణ పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో ఆయుష్ హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో బుధవారం అమ్మవారి జన్మ నక్షత్రం (ఉత్తరా నక్షత్రం) పురస్కరించుకుని ఆయుష్ హోమం జరిపారు. ఉదయం 9 గంటలకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి నెలా ఉత్తరా నక్షత్రం రోజున ఉదయం 9 గంటలకు నిర్వహించే ఆయుష్ హోమంలో పాల్గొనదలిచే భక్తులు రూ. 2,516 పూజా రుసుం చెల్లించి పూజలో పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో చెల్లించి, ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన వారు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 వాట్సప్ నెంబరుకు పంపవచ్చు. కార్యక్రమంలో ఈవో శిరీషతో పాటు ఏఈవో వెంపలి రాంబాబు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా వాహనాల మళ్లింపు



జాతీయ రహదారి నుంచి నిబంధనలకు విరుద్ధంగా సర్వీసు రోడ్లోకి మళ్లుతున్న వాహనాలు

- అనుమతి లేకున్నా జాతీయ రహదారి నుంచి సర్వీసు రోడ్డులోకి ప్రవేశం

ఆనందపురం : జాతీయ రహదారిని ఆరు లైన్ల రహదారిగా విస్తరించిన అనంతరం తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో వాహనాలు ఇష్టానుసారంగా రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని వెల్లంకి – వేములవలస మధ్య ఆరు లైన్ల రహదారికి అనుసంధానంగా సర్వీసు రోడ్లు ఏర్పాటు చేశారు. ఆనందపురం జంక్షన్ నుంచి వెల్లంకి తోపాటు తగరపువలస, ఇతర ప్రాంతాలకు చేరుకోవడానికి సర్వీసు రోడ్డు ఏర్పాటు చేశారు. ఆనందపురం నుంచి వెల్లంకి మీదుగా తగరపువలస వైపు, తగరపువలస వైపు నుంచి ఆనందపురం వరకూ సర్వీసు రోడ్డులో వాహనాలు రాకపోకలు సాగించడానికి అవకాశం కలిగించారు. ఇదిలా ఉండగా వెల్లంకి వైపు నుంచి సర్వీసు రోడ్డు గుండా వచ్చే వాహనాలు నేరుగా జాతీయ రహదారిపైకి చేరుకోవడానికి అనుగుణంగా రోడ్డు నిర్మించారు. ఈ క్రమంలో జాతీయ రహదారి నుంచి ఎడమ వైపు సర్వీసు రోడ్లోకి వాహనాల ప్రవేశాన్ని నిషేధించారు. సర్వీసు రోడ్డు గుండా వచ్చే వాహనాల సౌలభ్యం కోసం ఆనందపురం జంక్షన్ వైపు మళ్లే చోట జాతీయ రహదారిని మూసివేయకుండా విడిచిపెట్టారు. ఇదే అదునుగా చాలా మంది వాహనదారులు జాతీయ రహదారి గుండా నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణించి ఎడమ వైపు ఉన్న ఆనందపురం జంక్షన్‌కు వచ్చే సర్వీసు రోడ్లోకి యూటర్న్ తీసుకుంటున్నారు. దీనివల్ల తగరపువలస నుంచి వచ్చే సర్వీసు రోడ్డు నుంచి, ఆనందపురం జంక్షన్ నుంచి వచ్చే వాహనాలతోపాటు జాతీయ రహదారి నుంచి మలుపు తీసుకునే వాహనాలు ఒకేసారి చేరుకోవడంతో గందరగోళం నెలకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఇక్కడ ప్రమాదాలు జరగడం పరిపాటయింది. ముఖ్యంగా రాత్రి వేళ ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా వాహనాల రాకపోకలను నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.

వైభవంగా లక్ష్మీదేవికి అష్టోత్తర సేవ



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ దేవి

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్ – 6లోని శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో కొలువైన శ్రీలక్ష్మీ దేవి అమ్మవారికి అష్టోత్తర సేవ బుధవారం నిర్వహించారు. 108 కలశాలతో అత్యంత వైభవంగా ఈ సేవ జరిపారు. ఇందులో భాగంగా పంచామృతాలు, వివిధ రకాల పండ్ల రసములతో అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రీతికరమైన తామర పువ్వులు, పలు రకాల సుగంధ పుష్పాలతో పూజ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

మదర్ చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయం



ఆచార్య పడాల్‌ను జ్ఞాపికతో సత్కరిస్తున్న సత్యగంగరాజు

సబ్బవరం: సేవా కార్యక్రమాలు చేపట్టడంలో లభించే సంతృప్తి మరెక్కడా దొరకదని ఏయూ డిపార్ట్ మెంట్ ఆఫ్ బోటనీ ఆచార్యుడు ఎస్‌బీ పడాల్ అన్నారు. సబ్బవరంలోని మదర్ చారిటబుల్ ట్రస్టును బుధవారం సందర్శించిన ఆయన ట్రస్టు ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలను తెలుసుకున్నారు. 9 ఏళ్లుగా ట్రస్టు ద్వారా అందిస్తున్న పలు సేవా కార్యక్రమాలను చూసి అభినందించారు. మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.అదేవిధంగా ఆచార్య పడాల్‌ను ట్రస్టు చైర్మన్ సత్యగంగరాజు ట్రస్టు టెక్నికల్ సలహాదారునిగా నియమించారు. కార్యక్రమంలో ట్రస్టు డైరెక్టర్లు పి. శ్రీనివాసరావు, టి. తారకేశ్వరి, ఆర్ మౌనిక, జి రమేష్,జ్యోతి,సుశీల,విలియం,కేరి పాల్గొన్నారు.

11న సిరికోన పంచవర్ష సాహిత్యోత్సవాలు

మద్దిలపాలెం: సిరికోన సాహితీ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 11న హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కమిటీ హాల్‌లో సిరికోన పంచవర్ష సాహిత్యోత్సవాలు నిర్వహించనున్నట్టు సాహితీ పురస్కార గ్రహీత స్వర్ణశైలజ తెలిపారు. 51వ వార్డు మాధవధారలోని ఓ ఫంక్షన్ హాల్లో బుధవారం మీడియా సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ద్రావిడ విశ్వవిద్యాలయం పూర్వ ఉప కులపతి గంగిశెట్టి లక్ష్మీనారాయణ సభాధ్యక్షత వహిస్తారని, మధ్యాహ్నం 2.30 గంటలకు వేడుకలు ప్రారంభవుతాయని చెప్పారు. స్వీయ రచనల ప్రదర్శన, పుస్తకావిష్కరణలు, ప్రతిభాపురస్కారాలు, సాహితీ పురస్కార ప్రదాన కార్యక్రమాలు జరుగుతాయని, సాయంత్రం కవి సమ్మేళనం, పలువురికి సన్మానాలు ఉంటాయని వివరించారు.

పైడిమాంబ ఘటాల ఊరేగింపు



అమ్మవారి ఘటాలను వీధుల్లో ఊరేగిస్తున్న ఆలయ కమిటీ

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధి నడుపూరు గ్రామ దేవత పైడిమాంబ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం అమ్మవారి ఘటాలను గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మునగపాక అచ్చింనాయుడు, మంత్రి శంకరనారాయణ ఆధ్వర్యంలో వారంరోజుల పాటు ఈ వేడుకలను నిర్వహించనున్నారు. ప్రతి రోజూ వేమువజాము నుంచే అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చనలు చేస్తున్నారు. ఈ నెల 14న ప్రధాన పండగ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆనందాల హోలీ



హోలీ సంబరాల్లో పాల్గొన్న సింహాద్రి జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా



కేరింతలు కొడుతున్న ఉద్యోగుల కుటుంబాలు



రంగులు పూసుకుని సందడి చేస్తున్న చిన్నారులు

పరవాడ: హోలీ సంబరాలను బుధవారం అట్టహాసంగా నిర్వహించారు. సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లో అధికారులు, కుటుంబ సభ్యులు ఒకరికొకరు రంగులు చల్లుకుని ఉత్సాహంగా గడిపారు. మిఠాయిలు తినిపించుకొని ఎంజాయ్ చేశారు. హోలీ సంబరాల్లో పాల్గొన్న సంస్థ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా సంస్థ ఉద్యోగులు, ఉద్యోగ కుటుంబాలు, డీఎల్‌సీ ప్రతినిధులకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. పెందుర్తిలోని అక్కిరెడ్డిపాలెంలో చిన్నారులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రైఫిల్ షూటింగ్ విజేతకు సత్కారం



సుందరరామిరెడ్డిని అభినందిస్తున్న చైర్మన్ సూర్యనారాయణరెడ్డి

పరవాడ: జాతీయ స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో సత్తాచాటిన సుందరరామిరెడ్డిని ఆదర్శంగా తీసుకుని మిగిలిన విద్యార్థులు లక్ష్యాలు చేరుకోవాలని సంస్కృతి గ్లోబల్ పాఠశాల చైర్మన్ పి.సూర్యనారాయణరెడ్డి ఆకాంక్షించారు. పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి ఎస్.సుందరరామిరెడ్డి ఢిల్లీలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో పాల్గొని రజత పతకం సాధించాడని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రులు నడిమిల్లి గనిరెడ్డి, శ్రీలక్ష్మి, కోచ్‌లు ఎస్. రామ్మోహన్, స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబు, కోచ్‌లు మనీషా, గోవింద్, లోహిత్ పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ తొలేళ్లు

నేడు ప్రధాన పండగ



ముత్యాలమ్మ అమ్మవారు

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి, బంగారమ్మపాలెం గ్రామాల్లో కొలువైన ముత్యాలమ్మ పండగలో భాగంగా బుధవారం తొలేళ్ల సంబరాన్ని వైభవంగా నిర్వహించారు. వేకువ జాము నుంచి ఆయా గ్రామాల్లో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకాపల్లిలోని ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకోవడానికి గురువారం జిల్లా నలుమూలలు నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. అందుకు తగ్గట్టుగా భక్తులు సౌకర్యార్థం ఉత్సవ కమిటీ తగిన ఏర్పాట్లు చేసింది. అనుపు మహోత్సవంలో భాగంగా గురువారం రాత్రి నిర్వహించనున్న సాము గరిడీలు, బాణ సంచాపోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

గురుకుల విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



విద్యార్థులకు వాటర్ బాటిళ్లు, ప్యాడ్‌లు అందజేస్తున్న సుందర్

ఆరిలోవ: శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షలకు సంబంధించిన మెటీరియల్‌ను సామాజిక కార్యకర్త కోలపల్లి ఉదయ సుందర్ బుధవారం అందజేశారు. పరీక్ష ప్యాడ్, పెన్సిల్, పెన్, డ్రాయింగ్ మెటీరియల్‌తో కూడిన కిట్లను ఇక్కడ విద్యార్థులకు అందజేశారు. గురుకులంలో మిగిలిన తరగతుల విద్యార్థులకు వాటర్ బాటిళ్లు, పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు జాగ్రత్తలు చెప్పారు. క్రమశిక్షణతో చదువుకుని తోటివారికి సహాయం అందించగలిగే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. గురుకులం ఉపాధ్యాయులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యమం మరింత ఉధృతం



755వ రోజు దీక్షలో పాల్గొన్న కార్మికులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం కార్మికులు చేస్తున్న ఉద్యమానికి ఎన్నో ఒత్తిళ్లు, మరెన్నో అడ్డంకులు సృష్టించినా ఉక్కు సంకల్పం ముందు నిలబడలేవని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. పైగా రెట్టించిన ఉత్సాహంతో ఉద్యమం ఉధృతం చేస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 755వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో బ్లాస్ఫర్నేస్ విభాగానికి చెందిన కార్మికులు కూర్చున్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని కేంద్రం ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఎంతో గొప్ప చరిత్ర కలిగిన స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే ఒప్పుకోబోమన్నారు. దీక్షలో నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన అనంతుని కల్యాణోత్సవాలు



అనంతుని ఉత్సవ విగ్రహాలతో కుంతీ మాధవ స్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో వారం రోజుల నుంచి జరుగుతున్న అనంతుని కల్యాణోత్సవాలు బుధవారం రాత్రి శ్రీపుష్పయాగంతో ముగిశాయి. ఇందులో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి కుంతీ మాధవ స్వామి ఆలయం చుట్టూ 12 సార్లు ప్రదక్షిణ చేయించారు. అనంతరం ఆలయంలోకి తీసుకెళ్లి ఉభయ దేవేరులతో అనంతునికి శ్రీ పుష్పయాగం నిర్వహించారు. 18 రకాల పుష్పాలు సమర్పించి ఈ యాగం జరిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, ఈవో ఎస్.నానాజీబాబు, పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, తాలాడ పద్మనాభం, తాలాడ పైడిరాజు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెందుర్తి
9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com